



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం,
జనవరి 17, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




## నీటి కేటాయింపులపై విచారణ

- రాష్ట్రాల వారీగా తొలుత సెక్షన్-3 కింద వాదన
- ఆ తర్వాతే విభజన చట్టం.. సెక్షన్-89 కింద విచారణ
- కృష్ణా ట్రిబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు
- ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్‌పై విచారణ
- తెలంగాణ వాదనలవైపే మొగ్గు అనుకూల పరిణామం: ఉత్తమ్



## సింగపూర్, దావోస్‌కు రేవంత్

- 6 రోజుల విదేశీ పర్యటనకు సీఎం బృందం.. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పరిశీలన

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

- వివిధ ప్రాజెక్టులకు అటవీశాఖ అనుమతులివ్వండి
- కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్‌కు సీఎం వినతి
- హైదరాబాద్ బస్సుల్ని ఈ-మోడల్లోకి మారుస్తాం
- దీనికి సహకరించండి.. కుమారస్వామికి విజ్ఞప్తి



న్యూఢిల్లీ, జనవరి 16 : రాష్ట్రంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల్లో మోదీ ప్రభుత్వం నుంచి సహకారం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో పలు అభివృద్ధి పనులకు అటవీ, పర్యావరణ శాఖ నుంచి అనుమతులను మంజూరు చేయాలని కేంద్రంలో ఆ శాఖ మంత్రి అయిన భూపేందర్ యాదవ్‌కు రేవంత్ విజ్ఞప్తి చేశారు. అటవీ శాఖ అనుమతులు రాకపోవడంతో రాష్ట్రంలో 161 ప్రాజెక్టులు నిలిచిపోయాయని వివరించారు. 38 ప్రాజెక్టులకు వన్యప్రాణి సంరక్షణ చట్టం అనుమతులు మంజూరు

(మిగతా 2వ పేజీలో)



# లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా..?

## సీఎంకు కేటీఆర్ సవాల్

హైదరాబాద్ : రేవంత్ రెడ్డిపై ఏసీబీ, ఈడీ కేసులు ఉన్నాయని చెప్పి.. తనపై కూడా ఏసీబీ, ఈడీ కేసులు నమోదు చేయించి, కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ కేసుల్లో వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలియజేసేందుకు తాను లై డిటెక్టర్ పరీక్షకు సిద్ధం.. రేవంత రెడ్డి సిద్ధమా..? అని కేటీఆర్ సవాల్ విసిరారు. ఈడీ విచారణ ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ కేసు పెట్టారు. విచారణ సంస్థలను, అధికారులను గౌరవించి ఈ నెల 9న ఏసీబీ విచారణకు హాజరయ్యాను. 16న ఈడీ విచారణకు హాజరయ్యాను. రెండు సంస్థలు కూడా ఒకటే రకమైన ప్రశ్నలు ఏడు గంటల పాటు అడిగారు. అన్ని వివరాలు తీసుకున్నారు. మీరు ఎన్ని సార్లు పిలిచినా వస్తాను. విచారణకు సహకరిస్తాను. రాజ్యాంగాన్ని న్యాయ వ్యవస్థను, కోర్టులను గౌరవించే బిడ్డగా చెబుతున్నా.. ఎన్ని ప్రశ్నలు అడిగినా సమాధానం చెప్తా.. పూర్తిగా విచారణకు సహకరిస్తాను. తన నిజాయితీని నిరూపించుకుంటానని చెప్పాను అని కేటీఆర్ తెలిపారు. ఏసీబీ, ఈడీ వంటి విచారణ సంస్థలకు విచారించేందుకు రూ. 5 నుంచి 10 కోట్లు ఖర్చు అవుతుందని వార్తా పత్రికల్లో చూశాను. సీఎం రేవంత్ రెడ్డికి ఒక మాట చెప్పలదచులకున్నా.. కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఏసీబీ, ఈడీ కేసు తనపై పెట్టారు. నువ్వంటే దొరికినోడివి.. నేను నిజాయితీపరుడిని.. దైర్యంగా ఎదుర్కొంటాను. ప్రజాధనం వృథా చేయకుండా ఆ 10 కోట్లతో రైతు రుణమాఫీ, ఆసరా పెన్షన్లు ఇవ్వొచ్చు. నీకు నిజాయితీ,

(మిగతా 2వ పేజీలో)



## హైదరాబాద్‌లో మెగా వ్యవసాయ మార్కెట్

2వేల కోట్లతో నిర్మాణం.. త్వరలో శంకుస్థాపన: తుమ్మల


## గురుకులాల భోజనం అమ్మ వంటను గుర్తుచేయాలి




దిల్‌సుఖ్‌నగర్, జనవరి16 : కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి సీతక్క చెప్పారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని తెలంగాణ సంక్షేమ రెసిడెన్సియల్ గురుకుల విద్యాలయంలో గురువారం నిర్వహించిన సంక్షేమ గురుకుల విద్యాలయాల ప్రిన్సిపాళ్ల సమావేశంలో ఆమె పాల్గొన్నారు. గురుకులాల్లో పదేళ్లుగా పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కొందరి రాజకీయ స్వార్థానికి ఉపా?ధ్యాయలు సమిధలుగా మారవద్దని సూచించారు. గురుకులాల వసతి గృహాల్లో అందిస్తున్న భోజనం అమ్మ చేతి వంటను గుర్తుకు చేసేలా ఉండాలన్నారు. కలుషిత ఆహార ఘటనలు చోటు చేసుకోకుండా అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు.

# 4 రోజుల్లో 6 కోట్ల మంది!

::: వైభవంగా సాగుతున్న మహా కుంభమేళా



మహాకుంభ్ నగర్/లఖ్‌నవూ, జనవరి 16: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా అంగరంగ వైభవంగా కొనసాగుతోంది. ఈ మహోత్తర ఆధ్యాత్మిక కార్యక్రమంలో కోట్లాదిమంది పాలుపంచుకుంటూ.. భక్తిపారవశ్యంతో మునిగి తేలుతున్నారు. గంగా, యమునా, సరస్వతి నదుల త్రివేణి సంగమంలో గురువారం లక్షలాది మంది పుణ్య స్నానాలు ఆచరించగా, తొలి 4 రోజుల్లో అమృత స్నానాలు ఆచరించిన వారి సంఖ్య 6 కోట్లు దాటిందని అధికారికవర్గాలు పేర్కొన్నాయి. 45రోజులుసాగే మహా కుంభమేళాలో పాల్గొనేందుకు 50 కోట్ల మంది వరకు ప్రయాగ్‌రాజ్ వచ్చే అవకాశం ఉందని డీజీపీ ప్రశాంత్ కుమార్ అన్నారు. 20 లక్షల మంది వరకు విదేశీ యాత్రికులు ఉంటారని అంచనా వేశారు. కాగా, భారత విదేశాంగ శాఖ ఆహ్వానం మేరకు 10 దేశాలకు చెందిన 21 మందితో కూడిన అంతర్జాతీయ బృందం ప్రయాగ్‌రాజ్‌లోని తాత్కాలిక టెంట్ సిటీకి చేరుకుంది. వీరంతా త్రివేణి సంగంలో పవిత్ర స్నానాలు చేయడంతోపాటు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. కుంభ్ ఆధ్మాత్మిక వైభవంలో కాంటే వాలే బాబా అలియాస్ రమేశ్ కుమార్ మాంఝీ 'ముళ్ల కంప పాన్పు'పై పడుకొని డమరుకం మోగిస్తూ తన భక్తిని చాటారు. మహా కుంభమేళాను ప్లాస్టిక్ రహితంగా ఉంచేందుకు ఆరెస్సెస్ 'వన్ ప్లేట్, వన్ బ్యాగ్' ప్రచారాన్ని ప్రారంభించింది. పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ యోగా సాధకులు 129 ఏళ్ల స్వామి శివానంద బాబా మహా కుంభమేళాకు హాజరయ్యారు. ఈయన గత వందేళ్లుగా ప్రయాగ్‌రాజ్, నాసిక్, ఉజ్జయినీ, హరిద్వార్‌లతో జరిగే ప్రతి కుంభమేళా కు హాజరవుతున్నారని ఆయన శిష్యుడు సంజయ్ సర్వజన పేర్కొన్నారు.

# హైదరాబాద్‌లో మెగా వ్యవసాయ మార్కెట్

## 2వేల కోట్లతో

## నిర్మాణం.. త్వరలో శంకుస్థాపన: తుమ్మల



ఖమ్మం, జనవరి 16 : హైదరాబాద్ సమీపంలోని కొహెడలో రూ.2వేల కోట్లతో 400 ఎకరాల్లో ప్రపంచ స్థాయి మెగా వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేయబోతున్నట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఈ మార్కెట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఖమ్మంలో బుధవారం రాత్రి అగ్నిప్రమాదానికి గురైన పత్తి మార్కెట్‌ను గురువారం మంత్రి తుమ్మల సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఖమ్మం, వరంగల్ నిజామాబాద్‌తో పాటు ఇతర వ్యవసాయ మార్కెట్ల అబివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కాగా, రాష్ట్రానికి పసుపుబోర్డు మంజూరు చేసినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపితే ఎంపీ అరవింద్‌కు అభ్యంతరం ఏమిటో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.

**23న కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు స్థల పరిశీలన**

కొత్తగూడెం: కొత్తగూడెంలో విమానాశ్రయ స్థల పరిశీలన కోసం ఆరుగురు సభ్యుల కేంద్ర బృందం (ఏఏఐ) ఈ నెల 23న రానుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడుతో మంత్రి తుమ్మల ఫోన్‌లో మాట్లా డుతూ.. కేంద్ర బృందం పర్యటన కోసం చర్యలు తీసుకోవాలని కోరగా ఈ నెల 23న జిల్లాకు బృందాన్ని పంపించేలా చర్యలు తీసుకుంటానని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు.

# విజయవాడ హైవేపై ట్రాఫిక్ జామ్

**రైల్వే బ్రిడ్జి వద్ద ఇరుక్కున్న కంటైనర్**

**4.కి.మీ మేర నిలిచిన వాహనాలు**


**హైదరాబాద్‌కు భారీగా ప్రజల**

**తిరుగు ప్రయాణం రోడ్లపై వాహనాల బారులు**

**హైదరాబాద్ దారిలోట్రాఫిక్ జామ్**

**ఏపీ నుంచి హైదరాబాద్‌కు ప్రజల రాక**

**ప్రధాన రోడ్లపై వాహనాల బారులు**




పుట్టి పెరిగిన పల్లెల్లో సంక్రాంతి పండుగను ఆనందంగా జరుపుకొన్న ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. ముఖ్యంగా కోడి పందేలను చూసేందుకు ఏపీలోని వివిధ ప్రాంతాలకు వెళ్లిన నగరవాసులు కనుమ ముగియగానే తిరుగుముఖం పట్టారు. ఫలితంగా ఏపీ నుంచి హైదరాబాద్ వైపు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోతున్నాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సులు, కార్లు ఇతర ప్రైవేటు వాహనాలు, బైక్‌ల వరదతో రద్దీ నెలకొంది. 65వ నంబర్ జాతీయ రహదారి, ఉమ్మడి నల్లగొండ జిల్లా చిట్యాల శివారులోని రైల్వే బ్రిడ్జి వద్ద కంటైనర్ ఇరుక్కుపోయింది. ఫలితంగా రోడ్డుకు ఇరువైపులా 4 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దాదాపు అరగంటపాటు వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పోలీసులు క్రేన్ సాయంతో వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ఇక ఏపీ నుంచి హైదరాబాద్‌వైపు జాతీయ రహదార్లపై రద్దీ నివారణకు టోల్‌గేట్ల వద్ద ప్రత్యేక చర్యలు చేపట్టారు. నల్లగొండ జిల్లాలోని గూడూరు, పంతంగి, కొర్లపహాడ్ టోల్‌ప్లాజాల మీదుగా గురువారం లక్ష వాహనాలు హైదరాబాద్‌కు వెళ్లాయి. గూడూరు టోల్‌ప్లాజా వద్ద రద్దీని నివారించేందుకు 100 అడుగుల దూరంలోనే ఫాస్టాగ్ స్కాన్ అయ్యేలా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. ఈ టోల్‌ప్లాజాలో మొత్తం 12గేట్లు ఉండగా, హైదరాబాద్ వైపు ఎనిమిది, వరంగల్ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను పంపుతున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు ప్రయాణిస్తే గురువారం 23వేల వాహనాలు వెళ్లాయి. ఇక్కడ బైక్‌ల మీద వస్తున్నవారికి పోలీసు సిబ్బంది డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. చౌటుప్పల్‌లో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్టు చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్ రెడ్డి తెలిపారు. హైవేపై 200మంది పోలీసులను నియమించినట్లు, రెండు పెట్రోలింగ్ వాహనాలను 24 గంటలు తిప్పుతున్నామని ఏసీపీ తెలిపారు. చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్ద 16గేట్లు కాగా హైదరాబాద్ వైపు 12గేట్ల నుంచి విజయవాడ వైపు నాలుగు గేట్ల నుంచి వాహనాలను అనుమతిస్తున్నారు. సాధారణ రోజుల్లో 20వేల వాహనాలు వెళుతుండగా, గురువారం అదనంగా 10వేల వాహనాలు వెళ్లాయి. కేతేపల్లి మండలం కొర్లపహాడ్ టోల్‌ప్లాజాలోని 12టోల్ వసూలు కౌంటర్లలో వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలకు ఏడు కౌంటర్లు, విజయవాడ వైపు వెళ్లే వాహనాలకు 5 కౌంటర్లు కేటాయించారు. ఇక్కడ సాధారణ రోజుల్లో 17వేల వాహనాలు వెళుతుండగా, గురువారం 50వేల వాహనాలు వెళ్లాయి.

# నీటి కేటాయింపులపై విచారణ

**రాష్ట్రాల వారీగా తొలుత సెక్షన్-3 కింద వాదన**

**ఆ తర్వాతే విభజన చట్టం.. సెక్షన్-89 కింద విచారణ**

**కృష్ణా ట్రైబ్యునల్ మధ్యంతర ఉత్తర్వులు**

**ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్‌పై విచారణ**

**తెలంగాణ వాదనలవైపే మొగ్గు అనుకూల పరిణామం: ఉత్తమ్**

అంతరాష్ట్ర నదీ జలాల వివాద చట్టం–1956లోని సెక్షన్–3 ప్రకారం జారీ చేసిన విచారణ విధి విధానాల ప్రకారం రాష్ట్రాల వారీగా నీటి కేటాయింపులపైనే తొలుత వాదనలు వింటామని కృష్ణా ట్రైబ్యునల్–2(జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్) స్పష్టం చేసింది. ఆ తర్వాతే రాష్ట్ర పునర్విభజన చట్టంలోని సెక్షన్– 89 కింద విచారణ నిర్వహిస్తామని పేర్కొంది. తెలంగాణ దాఖలు చేసిన ఇంటర్‌లోక్యూటరీ అప్లికేషన్(ఐఏ)పై గురువారం ఢిల్లీలో విచారణ చేపట్టిన ట్రైబ్యునల్.. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సెక్షన్–3 కిందే తొలుత విచారణ జరపాలని కొన్నేళ్లుగా తెలంగాణ పట్టుబడుతుండగా, తాజా నిర్ణయంతో రాష్ట్ర వాదన నెరవేరినట్టు అయింది. ఈ అంశంపై ఫిబ్రవరి 19వ తేదీ నుంచి 21వ తేదీ దాకా వాదనలు ట్రైబ్యునల్ ముందు జరగనున్నాయి. గురువారం కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు మంత్రి ఉత్తమ్ హాజరయ్యారు. గత 11 ఏళ్లలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ మంత్రి హాజరు కావడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

**సెక్షన్-3, సెక్షన్-89 చెబుతున్నదేంటి?**

తెలంగాణ ఏర్పాటు తర్వాత ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్–89కింద ప్రాజెక్టుల వారీగా కృష్ణా జలాల కేటాయింపులపై విచారణ జరపాలని జస్టిస్ బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ కోరుతూ కేంద్రం విధివిధానాలు జారీ చేసింది. గతంలో రాష్ట్రాల్లోని 'ప్రాజెక్టుల వారీ'గా నిర్దిష్ట కేటాయింపులు జరిగి ఉండకపోతే, ఇప్పుడు జరపాలని సూచించింది. నీటి లభ్యత లేని సమయాల్లో ప్రాజెక్టుల వారీగా నీటి విడుదల విషయంలో అమలు చేయాల్సిన ఆపరేషన్స్ ప్రొటోకాల్స్‌ను సిద్ధం చేయాలని పేర్కొంది. అయితే, ఈ పరిధిలోకి ఏయే ప్రాజెక్టులొస్తాయన్న అంశంపై స్పష్టత ఇవ్వలేదు. దీనిపై తెలంగాణ పలు మార్లు అభ్యంతరం వ్యక్తం చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం–1956లోని సెక్షన్–3 కింద రాష్ట్రాలవారీగా కృష్ణా జలాలు కేటాయించిన తర్వాతే, ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని పట్టుబట్టింది. ఎట్టకేలకు దీనిపై స్పందించిన కేంద్రం కృష్ణా ట్రైబ్యునల్–2కు అదనపు రెఫరెన్స్(మరిన్ని విధివిధానాలను)జారీ చేస్తూ 2023 అక్టోబరు 6న గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. సెక్షన్ 89(ఏ), 89(బీ)లోని 'ప్రాజెక్టుల వారీగా' అనే పదానికి విస్తృత అర్థాన్ని ఇచ్చింది. ఈ మేరకు తాజాగా కృష్ణా ట్రైబ్యునల్–2 దీనిపై నిర్ణయం తీసుకుంది. తొలి, తదుపరి విధివిధానాల్లో చాలా అంశాలు ఒకేరకంగా ఉన్నాయని, రెండింటినీ కలిపి విచారిస్తే సుప్రీంలో ఏపీ వాదన నెగ్గితే సమస్య తలెత్తుతుందని ట్రైబ్యునల్ అభిప్రాయపడింది. అందువల్ల నదీజలాల పంపిణీకి సంబంధించిన ప్రశ్నను పరిశీలించే తదుపరి విధి విధానాలను విచారించడమే సవ్యంగా ఉంటుందని చైర్మన్ బ్రజేశ్ కుమార్, సభ్యులు జస్టిస్ తలపాత్ర, జస్టిస్ రామ్ మోహన్ రెడ్డి అభిప్రాయపడ్డారు.

# సింగపూర్, దావోస్‌కు రేవంత్

**6 రోజుల విదేశీ పర్యటనకు**

**సీఎం బృందం.. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు పరిశీలన**



హైదరాబాద్, జనవరి 16 : తెలంగాణకు భారీగా పెట్టుబడులను సమీకరించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్, దావోస్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఆరు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా గురువారం రాత్రి ఆయన ఢిల్లీ నుంచి సింగపూర్ వెళ్లారు. అక్కడ మూడు రోజుల పర్యటన అనంతరం దావోస్ వెళ్తారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు ఈ పర్యటనలో సీఎం రేవంత్ వెంట ఉంటారు. శుక్ర, శని, ఆదివారాల్లో సీఎం, మంత్రి, అధికారులు సింగపూర్‌లో పర్యటిస్తారు. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీల ప్రతినిధులతో సంప్రదింపులు జరుపుతారు. ఈ సందర్భంగా ప్రపంచంలో పేరొందిన సింగపూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సందర్శిస్తారు. నైపుణ్యాభివృద్ధికి ఆ యూనివర్సిటీ ఎంచుకున్న కోర్సులు, అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేస్తారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి సహకారం అందించేందుకు సింగపూర్ ఐటీఈతో ఒప్పందం చేసుకుంటారు. సింగపూర్‌లో రివర్ ఫ్రంట్‌ను సందర్శిస్తారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును ప్రపంచ స్థాయిలో చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తున్నందున అక్కడి రివర్ ఫ్రంట్ ఏరియాను అభివృద్ధి చేసిన తీరును పరిశీలిస్తారు. సింగపూర్ పర్యటన అనంతరం ముఖ్యమంత్రి, బృంద సభ్యులు ఈ నెల 20న ఉదయం దావోస్ చేరుకుంటారు. 20 నుంచి 22 వరకు వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సు–2025లో పాల్గొంటారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి.

# తెలంగాణ అభివృద్ధికి సహకరించండి

చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుల్లో ఎక్కువగా మారుమూల ప్రాంతాలు, వామపక్ష తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నాయని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఇందిరా పర్యావరణ్ భవన్‌లో భూపేందర్‌తో సీఎం భేటీ అయ్యారు. ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ ఉన్నారు. భేటీ సందర్భంగా సీఎం పలు అంశాలన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనుమతులు రాకపోవడంతో జాతీయ రహదారులు, ఏజెన్సీ ప్రాంతాల్లో టవర్ల నిర్మాణం, పీఎంజీఎసవై, పొరుగు రాష్ట్రాలను అనుసంధానించే రహదారుల నిర్మాణ పనులు నిలిచిపోయాయని సీఎం తెలిపారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన పనులకు అనుమతులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వినతులకు భూపేందర్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. హైదరాబాద్‌లో తిరిగే వంద శాతం బస్సులను ఎలక్ట్రిక్ మోడల్‌లోకి మార్చేందుకు సహకరించాలని కేంద్ర భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసి రేవంత్ విజ్ఞప్తి చేశారు. కుమారస్వామి కార్యాలయానికి వెళ్లి ఆయనతో సీఎం భేటీ అయ్యారు. పీఎం ఈ–డ్రైవ్ పథకం కింద జీసీసీ పద్ధతిలో బస్సులు కేటాయించాలని ఇప్పటికే తమ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఉన్న డీజిల్ బస్సులకు ఎలక్ట్రిక్ కిట్ అమర్చి రిట్రో ఫిట్మెంట్ పద్ధతిలో ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చేందుకు అవకాశం ఉన్న విషయాన్ని సీఎం ప్రస్తావించారు. హైదరాబాద్‌కు కేంద్రం కేటాయించే 2,800 బస్సులను జీసీసీతో పాటు రిట్రో ఫిట్మెంట్ మోడల్ కింద కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ కార్యాలయానికి వెళ్లిన సీఎం, ఆయనతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. సీఎం వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, పొన్నం, పొంగులేటి, ఎంపీలు బలరాంనాయక్, రఘువీర్‌రెడ్డి, రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్‌సీ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.


# లైవ్‌లో లై డిటెక్టర్ పరీక్షకు

## నేను సిద్ధం.. రేవంత్ సిద్ధమా..?

ధైర్యం ఉంటే.. ఏసీబీ జడ్జి, హైకోర్టు న్యాయమూర్తి అయినా.. ఎవరి ముందైనా సరే కూర్చుందాం.. మీరు మొత్తం మీడియాను లైవ్ పెట్టండి.. ఏ ప్రశ్న అడిగినా సరే సమాధానం చెబుతాను. మీపై నమోదైన ఏసీబీ, ఈడీ కేసుల్లో కూడా ప్రశ్నిద్దాం. ఇద్దరికి లై డిటెక్టర్ పరీక్ష పెట్టండి.. అప్పుడు 50 లక్షల్లో ఒడిసిపోతది. భారీగా ఖర్చు పెట్టడం దేనికి..? విచారణ సంస్థల అధికారులు, మీడియా సంస్థల సమయం వృథా అయితోపోంది.. నీకు ధైర్యం ఉంటే నీ జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో అయినా.. న్యాయమూర్తుల ముందైనా, ఈడీ ఆఫీసులోనైనా కూర్చుందాం. నీకు ధైర్యం ఉంటే నీవే తేదీలు, సమయం ప్రకటించు.. నేను కూడా వస్తా. లై డిటెక్టర్ పరీక్ష పెట్టి ఎవరు ఏందో తేల్చుకుందాం అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. విచారణకు ఎన్నిసార్లైనా వస్తా.. ఎన్ని పరీక్షలు పెట్టినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాను. న్యాయ వ్యవ్థ మీద నమ్మకం ఉంది. న్యాయం గెలుస్తదనే విశ్వాసం ఉంది. తప్పు చేయలేదు.. అరపైసా అవినీతి జరగలేదు. తప్పు చేసి ఉంటే రుజువు చేయండి.. ఏ శిక్షకైనా సిద్ధమని చెప్పానని కేటీఆర్ తెలిపారు.

# సైఫ్ అలీఖాన్‌కు కత్తిపోట్లు

లోతుగా కత్తిపోట్లు కాగా.. చేతిపై, భుజంపై మరో నాలుగు గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే సైఫ్‌ను లీలావతి ఆస్పత్రికి తరలించారు. ఆ సమయంలో కారు సిద్ధంగా లేకపోవడంతో లేకపోవడంతో.. సైఫ్‌ను ఆటోలో తీసుకెళ్లారు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో పనిమనిషి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాంద్రా పోలీసులు భారత న్యాయ సంహిత(బీఎన్ఎస)లోని సెక్షన్లు 311(దోపిడీ యత్నం, హత్యాయత్నం, తీవ్రంగా గాయపరచడం), 331(4) (అనుమతి లేకుండా ఇంట్లోకి చొరబాటు, చోరీ యత్నం) కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే కేసును ముంబై క్రైమ్ బ్రాంచ్‌కి బదిలీ చేశారు. సైఫ్ ఉంటున్న సద్గురు శరణ్ అపార్ట్‌మెంట్ సీసీకెమెరాల ఫుటేజీని జల్లెడపట్టిన పోలీసులు.. నిందితుడి ఫొటోను మీడియాకు విడుదల చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు 7 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. క్లూస్‌టీమ్ కీలక ఆధారాలను సేకరించగా.. స్నిఫర్ డాగ్స్‌తో దర్యాప్తు కొనసాగించారు. ఎన్‌కౌంటర్ స్పెషలిస్టుగా పేరున్న దయానాయక్ కూడా సైఫ్ ఇంటిని పరిశీలించారు. ఈ దర్యాప్తులో ఆయన కూడా పాలుపంచుకుంటారని తెలుస్తోంది. కొంతకాలంగా అపార్ట్‌మెంట్ ఉన్న హౌసింగ్ సొసైటీలో పలు ఇళ్లకు మరమ్మతులు జరుగుతున్నాయని, అక్కడ పనిచేస్తున్న కార్మికులను కూడా ప్రశ్నిస్తున్నామని పోలీసులు వివరించారు. సైఫ్ అలీఖాన్‌పై దాడి ఘటన రాజకీయ దుమారం రేపుతోంది. ముంబైలో సెలబ్రిటీలకే భద్ర త లేకుంటే.. సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ఎన్‌సీపీ(ఎసపీ) చీఫ్ శరద్‌పవార్ ప్రశ్నించారు. శాంతిభద్రతలు అదుపుతప్పాయని విమర్శించారు. గత ఏడాది బాంద్రాలోనే ఎన్సీపీ మాజీ ఎమ్మెల్యే బాబా సిద్ధిఖీ హత్యకు గురైన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుతం సీఎం ఫడణవీస్ వద్దే హోం శాఖ ఉన్న విషయం తెలిసిందే..! ముంబైలో ఎవరూ సురక్షితంగా లేరని శివసేన(యూబీటీ) ఎంపీ సంజయ్‌రౌత్ ఆరోపించారు. మహా రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ నానా పటోలే కూడా హోంశాఖను తనవద్ద పెట్టుకున్న ముఖ్యమంత్రి ఫడణవీస్ శాంతిభద్రతల విషయంలో దారుణంగా విఫలమయ్యారంటూ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ ఘటనపై విస్మయం వ్యక్తం చేశా రు. తీవ్ర గాయాలపాలైన సైఫ్ అలీఖాన్‌కు లీలావతి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ నితిన్ డాంగే(న్యూరో సర్జన్), డాక్టర్ లీనా జైన్(కాస్మెటిక్ సర్జన్), డాక్టర్ నిషా గాంధీ(అనస్థీషియాలజిస్టు) రెండున్నర గంటల పాటు శ్రమించి, శస్త్రచికిత్స చేశారు. 2.5 అంగుళాల పొడవున్న కత్తి ముక్కను సైఫ్ వెన్నెముఖ నుంచి తొలగించామని వైద్యులు పేర్కొన్నారు. "తెల్లవారుజామున 3 గంటల సమయంలో సైఫ్‌ను ఆస్పత్రికి తీసుకువచ్చారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉంది. రెండ్రోజుల్లో కోలుకుంటారు. ఆ తర్వాత ఆయనను నాన్–ఐసీయూ వార్డుకు తరలిస్తాం" అని లీలావతి ఆస్పత్రి సీవోవో డాక్టర్ నీరజ్ వెల్లడించారు. వెన్నెముక గాయాన్ని సరిచేసి, లీకైన ఫ్లూయిడ్లను సరిచేశామన్నారు. చేతికి, మెడకు ప్లాస్టిక్ సర్జరీలు చేశామని తెలిపారు. కాగా.. ఆస్పత్రి వద్ద సైఫ్, కరీనా టీమ్‌లు మీడియాతో మాట్లాడాయి. ఈ దాడి విషయంలో మీడి యా సంయమనం పాటించాలని కోరాయి. సైఫ్ పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలియజేస్తామన్నాయి.



# సునీతా విలియమ్స్.. 8వ సారి స్పేస్ వాక్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎసఎస)లో చిక్కుపోయిన సునీతా విలియమ్స్ ఏడు నెలల తర్వాత స్పేస్ వాక్ కోసం ఐఎసఎస్ నుంచి బయటకు వచ్చారు. ప్రస్తుతం స్టేషన్ కమాండర్‌గా వ్యవహరిస్తున్న ఆమె.. మరో వ్యోమగామి నిక్ హేగ్‌తో కలిసి ఐఎసఎసకు సంబంధించి కొన్ని మరమ్మతు పనులు చేయాల్సి ఉంది. కాగా, 2012లో చివరిసారిగా స్పేస్ వాక్ చేసిన సునీతకు ఇది 8వ సారి. గత ఏడాది జూన్ 6న బోయింగ్ 'స్టార్‌లైనర్'లో ఐఎసఎసకు వెళ్లిన సునీతా విలియమ్స్, బుచ్ విల్‌మోర్‌లు అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే.

# దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్‌కు మంత్రి పదవి ఇవ్వాలి

## గిరిజన ముద్దుబిడ్డ ఎమ్మెల్యే బాలునాయక్ మంత్రిగా ప్రకటించాలి

## దేవరకొండ నియోజకవర్గం పూర్తిగా అభివృద్ధి చెందాలంటే మంత్రిగా స్థానం ఇవ్వాలి





దేవరకొండ జనవరి 16 వార్త మిర్రర్ : దేవరకొండ గిరిజన ముద్దుబిడ్డ, నియోజకవర్గ శాసనసభ్యులు పేదల గుండెల్లో ప్రత్యేక స్థానాన్ని నిలుపుకున్న వ్యక్తి నేనావత్ బాలునాయక్ అని పాత తెల్దేవర్ పల్లి కాంగ్రెస్ నాయకులు మేడమోని మల్లేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో భాగంగా కాంగ్రెస్ అధిష్టానం శ్రీమతి సోనియా గాంధీ రాహుల్ గాంధీ ఆశీస్సులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో మంత్రివర్గ విస్తరణలో ఒక గిరిజన మంత్రిగా ఎమ్మెల్యే బాలునాయక్ ను నియోజకవర్గ ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని వారన్నారు. దేవరకొండ నియోజకవర్గం అభివృద్ధి పథంలో దూసుకెళ్లే దిశగా ఎమ్మెల్యే బాలు నాయక్ అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆయన అన్నారు. ముఖ్యంగా దేవరకొండ నియోజకవర్గం లో పూర్తిగా గిరిజనుల ప్రాంతమైన గిరిజనులకు వ్యాపార పరంగా ఉద్యోగ పరంగా నియోజకవర్గంలో ఎటువంటి పరిశ్రమలు కానీ ఫ్యాక్టరీలు గాని లేవని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాలు గత ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరికి గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధి నేర్చుకోలేదని తెలంగాణ రాష్ట్రంలో మారుమూల ప్రాంతమైన గిరిజన నియోజకవర్గంలో ఎక్కువగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నిరు పేదలు ఎక్కువగా ఉండే నియోజకవర్గం గత 30 సంవత్సరాల నుండి దేవరకొండ మారుమూల ప్రాంతం నియోజకవర్గం అయినా తెలంగాణ రాష్ట్రంలో దేవరకొండకు ఏ ప్రభుత్వము అయినా మంత్రి వర్గంలో చోటు కల్పించలేరు. నేనావత్ బాలు నాయక్ కు సామాన్య కార్యకర్త నుంచి జెడ్పిటిసిగా, మార్కెట్ కమిటీ చైర్మన్ గా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గా, జిల్లా పరిషత్ చైర్మన్ గా, రెండోసారి శాసన సభ్యులు గా భారీ మెజార్టీతో గెలిచి ప్రజల యొక్క అభిమానాన్ని పొందారనీ వారు అన్నారు.. మంత్రిగా అవకాశం ఇస్తే ఈ నియోకవర్గ ప్రజలకు మరింత చేరువై ఈ ప్రాంతంలో పెండింగ్లో ఉన్నటువంటి సక్కలగండి ప్రాజెక్ట్, ఎస్ ఎల్ బి సి,మహిళా డిగ్రీ కళాశాల, ఆశగ్రికల్చర్ పాలిటెక్నిక్ కాలేజ్, కల్వకుర్తి ఎత్తిపోతల, డిండి ప్రాజెక్టు అభివృద్ధి ద్వారా, లింక్ కెనాల్ ద్వారా, చాలా చెరువులు కుంటలు నిండి గ్రామాలలో ఉన్నటువంటి ప్రజలకు సాగునీరు అందే అవకాశం ఉంటుంది అన్నిప్రతి గ్రామంలో సిసి రోడ్లు, డ్రైనేజ్ లనిర్మాణం, కొండ భీమనపల్లి చెరువు మినీ ట్యాంక్ బండ్ గా ఏర్పాటు నూతన ఆర్టీవో కార్యాలయం ఏర్పాటు మొదలైనా అభివృద్ధికి నోచుకొని విషయాలు చాలా ఉన్నాయి అని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజా పాలనలో ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదిస్తున్నారని అని ఆయన అన్నారు. ప్రస్తుతం జరిగే మంత్రివర్గ విస్తరణలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ కు మంత్రివర్గంలో చోటు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.ముఖ్యంగా నిరుపేద కుటుంబం నుండి విద్యార్థి దశ నుండే కాంగ్రెస్ పార్టీలో కీలక భూమిక చురుగ్గా పనిచేస్తూ అంచలంచేలుగా ఎదుగుతూ దేవరకొండ నియోజకవర్గం వ్యాప్తంగా గిరిజనుల ఆరాధ్య దైవంగా బాబు నాయక్ ఎదిగాడని అని ఆయన పేర్కొన్నారు. గిరిజనులు ఎమ్మెల్యే బాలు నాయక్ విజయంలో కీలక పాత్ర పోషించాలని రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ఆయన పని చేస్తున్నారని ఆమె తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అంటే గిరిజనులకు అమితమైన ప్రేమ ఎనలేని భక్తి అని ఆయన తెలిపారు.గిరిజనుల అభివృద్ధి కోసం ఆనాడు ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయానికి గిరిజనులు ఇప్పటికీ ఇందిరాగాంధీని దేవతగా కొలుస్తారని ఆ ఫలితమే దేవరకొండ నియోజకవర్గం గిరిజన ఎమ్మెల్యే బాలు నాయక్ సేవలు అందిస్తున్నారని ఆమె తెలిపారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలంటే అభివృద్ధి ప్రదాత ప్రజల మనిషి,నిరంతరం ప్రజల కోసమే ఆలోచించే వ్యక్తిత్వం కలిగిన మనిషి బాలు నాయక్ అని వారికి తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రి వర్గంలో చోటు కల్పించి మారుమూల ప్రాంతమైన దేవరకొండను అభివృద్ధి పథంలో నడిపించుటకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్యే బాలు నాయక్ కు మంత్రి పదవి ఇవ్వాలని వారితో పాటు మేడారం రాములు మూడవత్ హనుమంతు నాయక్ గన్య భావోజి మంగ్లా నాయక్ ఏడుకొండలు కోరారు.

# తర్నికల్ క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రధానం

## డీ ఎఫ్ సి ఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు బాల్ చందర్



కల్వకుర్తి జనవరి 16 వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామం లో నిర్వహించిన తర్నికల్ ప్రీమియర్ లీగ్ (టి పీ ఎల్) విజేతలకు విన్నర్ గా గెలుపొందిన గొడుగు రవి కుమార్ టీ0 కు గారెల జంగయ్య మొదటి బహుమతిని రూ "15000 రూపాయలు అందించారు. రెండో విజేతగా గెలుపొందిన రన్నర్ గా గెలుపు పొందిన గారెల సంజీవ టీ0 కు మాజీ సర్పంచ్ తాళ్ల పండు గౌడ్ డి ఎఫ్ సి ఎస్ జిల్లా గొడుగు భానుచందర్ దండు మహేష్ కలిసి కు రెండవ బహుమతి గా రూ"10000 రూపాయలు మొదటి బహుమతి కప్పును రెండో బహుమతి కప్పును అందించారు. నాయకులు మాట్లాడుతూ తర్నికల్ గ్రామంలోని యువకులంతా కలిసి గత మూడు సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న టి పి ఎల్ క్రికెట్ టోర్నమెంట్ కి హాజరై క్రీడాకారులను ఆదరిస్తూ అనంతరం క్రికెట్ క్రీడాలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి మరియు విన్నర్ టీం కి రన్నర్ టీం కి శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా ఆట ఆడటం వల్ల గ్రామంలో ఐక్యత తో పాటు స్నేహ భావాలు పెంపొందుతాయని ఇకముందు కూడా తర్నికల్ క్రికెట్ లిక్ కి తన వంతు సాయం తప్పకుండా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తాళ్ల పాండు గౌడ్. డీ ఎఫ్ సి ఎస్ జిల్లా డైరెక్టర్ గొడుగు భానుచందర్ ముదిరాజ్. గారెల జంగయ్య.దండు మహేష్. బచ్చులకూర శ్రీశైలం. తాళ్ళ సురేష్ గౌడ్. గాద మౌని సురేష్ గౌడ్. వర్కల దేవయ్య. జి వెంకటయ్య. అరవింద్ గౌడ్. తిరుపతి. కుమారు. రాజు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేశారు.

# రైతు భరోసా పథకము ద్వారా లబ్ధి పొందే

# రైతుల భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్ నారాయణ అమిత్





మిర్యాలగూడ జనవరి 16:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలంలోని ఆలగడప, అన్నారం గ్రామాల్లో రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందే రైతుల భూముల పరిశీలనను మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ గురువారం పరిశీలించారు. ఆలగడప గ్రామపంచాయతీ పరిధిలోని వ్యవసాయేతర భూముల(నాలా)ను గుర్తించగా వాటిని లబ్ధి కలగ కుండా తొలగించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. పకడ్బందీగా పరిశీలన చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్ ఎన్.హరిబాబు పాల్గొన్నారు. మిర్యాలగూడ మండలం లో రైతుభరోసా లబ్దిదారుల ఎంపికకు 5 టీములను పర్యవేక్షణ కోసం రైతు భరోసా లబ్ధిదారుల ఎంపికలో భాగంగా గురువారం మిర్యాలగూడ మండలంలోని అన్నారం, జప్తివీరప్పగూడ ఆలగడప, హైదలాపురం తడకమల్ల, తక్కెళ్ళపహాడ్, గూడూరు, కిష్టాపురం, నంది పహాడ్ గ్రామాల్లో సాగు భూమి వివరాలు సేకరించి సాగుకు యోగ్యం కానీ భూముల వివరాలు రెవిన్యూ శాఖ మరియు వ్యవసాయ శాఖ అధికారులతో 5 బృందాలుగా ఏర్పాటు చేసుకొని రైతు భరోసా సర్వే నిర్వహించారు. ఇందులో భాగంగా ఏఈఓలు ఎండీ.షఫీ రమ్య, అఫ్రీన్, గోపి, రమేష్, ఆర్ఐలు టీ.రామకృష్ణ సత్యనారాయణ, మృదుల నిర్వహించగా మిర్యాలగూడ మండల తహసీల్దార్ ఎన్.హరిబాబు, మండల స్పెషల్ ఆఫీసర్, వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.దేవ్ సింగ్, మండల వ్యవసాయ అధికారి డి.సైదానాయక్ పర్యవేక్షించారు.

# ఘనంగా ర్యాకల ఆదిత్య జన్మదిన వేడుకలు

## ర్యాకల ఆదిత్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన యాదాద్రి జిల్లా సీఈవో శోభారాణి



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : భువనగిరి మండలం, తాజ్ పూర్ గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన, యాదాద్రి జిల్లా సీఈఓ శోభ రాణి, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త, డాక్టర్ ర్యాకల శ్రీనివాస్- సంతోష ల కుమారుడు ర్యాకల ఆదిత్య పుట్టినరోజు విషయం తెలుసుకొని ర్యాకల ఆదిత్యకు శాలువా కప్పి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు, శోభారాణి మాట్లాడుతూ చదువుతోపాటు మీ తల్లిదండ్రుల సేవ గుణాన్ని, వారి నడవడిక, కొనసాగించాలని, సమాజం పట్ల బాధ్యత, తల్లిదండ్రుల పట్ల గౌరవం, విద్య బోధించే ఉపాధ్యాయుల పైన గౌరవం, తోటి విద్యార్థుల పట్ల స్నేహం సహాయ సహకారాలు వంటి గుణాలను పెంపొందించుకోవాలని ర్యాకల ఆదిత్యకు తెలిపారు, ఈ సందర్భంగా ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ బాధ్యతగా చదువుతేనే ఉజ్వల భవిష్యత్తు కనిపిస్తుందన్నారు, బాధ్యతగల విద్యార్థిగా గొప్ప చదువులు చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విలువైన సమయాన్ని విద్యకు ఉపయోగించి సద్వినియోగం చేసుకొని ఉన్నతగా ఎదిగి ఆదర్శవంతంగా జీవించాలని తెలిపారు,



## మానవత్వం చాటుకున్న క్రికెట్ క్రీడాకారులు

### బచ్చన గూడెం జట్టు కెప్టెన్ లోగి గౌడ్ (టీం)

సంస్థాన్ నారాయణపూర్ జనవరి 16:( వార్తమిర్రర్) : సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్లో బహుమతి సాధించిన బచ్చన గూడెం క్రికెట్ కెప్టెన్ బొల్లెపల్లి లోగి టీం సభ్యులు దయా హృదయాన్ని చాటుకున్నారు.నెల రోజుల క్రితం అనారోగ్య సమస్యలతో చనిపోయినటువంటి ఆకారపు లక్ష్మణ్ కుటుంబానికి 10000 పదివేల రూపాయలు నిత్యవసర సరుకుల రూపంలో అందజేశారు.ఈ యొక్క కార్యక్రమాన్ని చేపట్టిన జట్టు సభ్యులకు గ్రామ ప్రజలు,అభిమానులు,కృతజ్ఞతలు తెలియజేశారు.





## యంగ్ ఇండియా కే బోల్ సీజన్ -5 పోస్టర్ ఆవిష్కరణ

దేవరకొండ జనవరి 16 వార్త మిర్రర్ : నల్లగొండ జిల్లా కేంద్రంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మేకల ప్రమోద్ రెడ్డి అధ్యక్షతన జాతీయ యువజన కాంగ్రెస్ ప్రతిష్టత్మకంగా తలపెట్టిన "యంగ్ ఇండియా కే బోల్" సీజన్-5 పోస్టర్ ఆవిష్కరణలో దేవరకొండ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ పాల్గొన్నారు, ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న 6 గ్యారంటీల "పథకాలను" ప్రజలకు చేరేవిదంగా ప్రజలకు ప్రభుత్వం కి వారదిగా "యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని అన్నారు, అదే విదంగా కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానలను ఎండగట్టాలని, రాష్ట్రంలో ప్రతిపక్షాలు ప్రభుత్వం పైన చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాలని సూచించారు, "యంగ్ ఇండియా కే బోల్" కార్యక్రమం ద్వారా యువత లోని నైపుణ్యంను వెలికితీసి వారి ప్రతిభని గుర్తించడానికి ఉపయోగపడుతుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మేద సైదులు, దేవరకొండ మండల అధ్యక్షులు ముకురోజు రాజు, నేరేడుగొమ్ము మండల అధ్యక్షులు నీలం ఆంజనేయులు, డిండి మండల ఉపాధ్యక్షులు అడపాల రాంరెడ్డి లు పాల్గొన్నారు.



## రోడ్డు ప్రమాదంలో

## మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:- కల్వకుర్తి మండలం తోటపల్లి గ్రామంల్లో దళిత కుటుంబాలకు చెందిన నాగమ్మ,మహేష్, బంగారయ్య నిన్న సాయంత్రం తర్నికల్ దగ్గర ఘోర రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే చనిపోవడం జరిగింది. మృతి చెందిన కుటుంబాలకి కారు యాజమాన్యం స్పందించకపోవడంతో మృతుల కుటుంబీకులు మహబూబ్ నగర్ చౌరస్తా వద్ద రాస్తారోకో ధర్నా చేపట్టారు. బిజెపి నాయకులు నరేష్ గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని,అన్నారు.



## పెయింటింగ్ యూనియన్‌కు స్థలం కేటాయించాలని వినతిపత్రం

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 16 : చౌటుప్పల్ మండల పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ కమిటీ అధ్యక్షులు బండమీది ఎల్లయ్య ఆధ్వర్యంలో చౌటుప్పల్ తహశీల్దార్ కు పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ భవన నిర్మాణ స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేయడం జరిగింది. తహశీల్దార్ మాట్లాడుతూ, అన్ని విధాలుగా తన వంతు సహాయంగా సహకరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు బండమీది ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శి గంగాపురం రమేష్ గౌడ్, కోశాధికారి మొహమ్మద్ సలీం పాషా ఖాన్, గౌరవ సలహాదారులు మాందొరి గాలయ్య, సహాయ కార్యదర్శి ఏచూరి అనిల్ కుమార్, సభ్యులు పిల్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు

# తెలుగు రాష్ట్రాల్లో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న ఇరువురి అరెస్ట్





మిర్యాలగూడ జనవరి 16:– (వార్తమిర్రర్) : తెలుగు రాష్ట్రాల్లో బైకు దొంగతనాలకు పాల్పడుతున్న శీలం నాగరాజు, వాటిని కొన్న మునుకుంట్ల కృష్ణాలను అరెస్టు చేసినట్టు మిర్యాలగూడ డిఎస్పీ కె.రాజశేఖర్ రాజు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక టూ టౌన్ పోలీసు స్టేషన్లో జరిగిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం పట్టణంలోని హనుమాన్ పేట ఫ్లై ఓవర్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేస్తుండగా శీలం నాగరాజు అనే అతను నంబర్ ప్లేట్ లేని బుల్లెట్ బైక్ పై వస్తుండగా ఆ బైక్ టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో దొంగిలించ బడినదని గుర్తించి స్టేషన్ కు తీసుకు వచ్చి విచారించగా అతను గత రెండేళ్లుగా ఎపిలోని నరసరావుపేట, వినుకొండ అదేవిధంగా మిర్యాలగూడలలో రాత్రి సమయంలో పార్కు చేసి ఉన్నా 5 మోటార్ సైకిళ్లను చోరీ చేశారన్నారు. వాటిని మిర్యాలగూడ పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న మునుకుంట్ల కృష్ణకు తక్కువ ధరకు విక్రయించాడని ఆయన తెలిపారు. అతని నుండి సుమారు రూ.6 లక్షల విలువైన 4 పల్సర్ మోటార్ సైకిల్స్, ఒక బుల్లెట్ బైక్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. చోరీ చేసిన నాగరాజు ఎపి రాష్ట్రం పల్నాడు జిల్లా రెంటచింతల మండలమి పాల్వాయి జంక్షన్ కు చెందిన వాడు, కొనుగోలు చేసిన కృష్ణ మిర్యాలగూడ పట్టణం ఇందిరమ్మ కాలనీకి చెందిన డిసిఎం డ్రైవర్. కేసును సిఐ పి. నాగార్జున ఆధ్వర్యంలో ఎస్ఐలు హరీష్ రెడ్డి, బి. రాంబాబు, ఎఎస్ఐ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్స్ పి. బాలకృష్ణ, కె. కళ్యాణ్, హోంగార్డు సాయిరెడ్డిలను డిఎస్పీ రాజశేఖర్ రాజు అభినందించారు.

# శర్మ జర్నలిజానికి చేసిన సేవలు చిరస్మరణీయం

మిర్యాలగూడ జనవరి 16:–(వార్తమిర్రర్) : దివంగత నందిభట్ల జనార్ధన్ శర్మ జర్నలిజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు కొనియాడారు. మిర్యాలగూడ పట్టణం ఎన్ఎస్పి క్యాంపులోని ప్రెస్ క్లబ్ లో శర్మ సార్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. శర్మ సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సీనియర్ జర్నలిస్టు హమీద్ మాట్లాడుతూ మిత్రుడు సహచరుడు శర్మ భౌతికంగా మనమధ్య లేకపోవడం బాధాకరమని అన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు పగిడి రామలింగయ్య యాదవ్ మాట్లాడుతూ విప్లవోద్యమంలో కలిసి పనిచేసిన కాలం నాటి నుంచి జర్నలిజం లో సేవలు అందించిన చివరి రోజుల వరకు తనతో విడదీయరాని అనుబంధం ఉందని, తన జ్ఞాపకాలను గుర్తు చేశారు. పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ జర్నలిజాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించి గొప్ప మానవతావాదిగా నిలిచారని అన్నారు. జర్నలిజంలో ఎందరికో అక్షర జ్ఞానం అందించిన మహనీయుడని పేర్కొన్నారు. వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర నాయకులుగా అందరికీ తలలో నాలుకగా ఉండి ఎనలేని సేవలు అందించిన ఆదర్శనీయుడని, ఆయన స్ఫూర్తిని జర్నలిస్టులు కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు ఎం.డి. అస్లాం, కలిమెల నాగయ్య, నాజీం, చిట్యాల శ్రీనివాసరావు, అన్నెబోయిన మట్టయ్య, అల్లుబెల్లి మనోజ్ కుమార్, గుండెపూరి వెంకటేశ్వర్లు, నామిరెడ్డి నరేందర్ రెడ్డి, అయూబ్, భువనగిరి అశోక్, పుప్పాల యాదగిరి, అమరారపు తిరుమలేష్, మంద సైదులు, కందుల రాంప్రసాద్, జంగా లక్ష్మణ్ యాదవ్, బొంగరాల మట్టయ్య, అల్లుబెల్లి వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, ఎలక్ట్రానిక్



మీడియా వేణుగోపాల్ రెడ్డి, మహేష్, పాపులర్ వెంకన్న, జయరాజ్, నాగరాజు, శివ, వేణుప్రసాద్, సైదయ్య, కాంగ్రెస్ నాయకులు మహబూబ్ అలీ, తెలంగాణ ఉద్యమ నాయకులు పోస్టల్ రామయ్య, అంబటి నాగయ్య, దేగ విటి, బెల్లంకొండ హరి, హనుమయ్య పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ప్రోత్సాహం అందించాలి

### 20వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎండి సలీం

### జన యే త్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు సన్మానం



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : ప్రభుత్వాలు క్రీడలను క్రీడాకారులను ప్రోత్సహించాలని 20వ వార్డు మాజీ కౌన్సిలర్ ఎండి సలీం అన్నారు. గురువారం నల్గొండ పట్టణంలోని పెద్ద బండ సెంటర్లో అండర్ 19 హాకీ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లో నలగొండ టీం ప్రధమ బహుమతి పొందిన సందర్భంగా జనయేత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో హాకీ క్రీడాకారులను సన్మానం చేయడం జరిగింది . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎండి సలీం మాట్లాడుతూ జనవరి 5 నుండి 10 వరకు నల్గొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో జరిగిన అండర్ 19 హాకీ రాష్ట్రస్థాయి టోర్నమెంట్ లో రాష్ట్రవ్యాప్తంగా 10 టీంలు పాల్గొనడం జరిగింది. దానిలో నల్లగొండ టీం పదమ బహుమతి పొందటం ఎంతో గర్వంగా ఉందని అన్నారు. పెద్ద బండ ప్రాంతంలో హాకీ క్రీడాకారులు మట్టిలో మాణిక్యం లాగా పైకొస్తున్నారని క్రీడలు క్రీడలలో రాణిస్తున్నారని వారు ఎంతో కృషితో పట్టుదలతో హాకీ క్రీడ వైపు ఆసక్తితో ఉండి విజయం వైపు పరుగులు తీస్తున్నారు ఈ ప్రాంతంలో క్రీడాకారులు అనేకమంది పేద కుటుంబాలకు చెందిన వారు అయినా సరే క్రీడల్లో రాణించాలని పట్టుదలతో ముందుకు వెళుతున్న పరిస్థితి ఉన్నది. ఇట్లాంటి క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటే ఇక్కడి కళాకారులు నల్లగొండ పేరును తన నివసిస్తున్న పెద్ద బండ ప్రాంతాన్ని దేశవ్యాప్తంగా వినిపించే విధంగా వారి యొక్క క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి సిద్ధంగా ఉన్నారని అందుకే ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని అన్నారు. జనవరి 29 నుండి ఫిబ్రవరి మూడవ తేదీ వరకు జార?ండ్ లో జరిగే నేషనల్ గేమ్స్ కి ఈ ప్రాంతం నుండి 5గురు క్రీడాకారులు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు వారికి అన్ని విధాలుగా ఈ ప్రాంతంలో ఉన్న ప్రతి ఒక్కరు కూడా వారి యొక్క క్రీడలను ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలు అందించాలని అదేవిధంగా జనయేత్రీ ఫౌండేషన్ క్రిడకారులను గుర్తించి వారికి ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించినందుకు ఎంతో సంతోషం ఉందన్నారు. భవిష్యత్తులో క్రీడాకారులకు మా వైపు నుంచి కూడా సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జనయేత్రీ ఫౌండేషన్ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యులు గాదేనరసింహ,కోట సైదులు, నోముల యాదయ్య, పాక లింగయ్య, ఆమంచి శ్రీనివాస్, తెలకలపల్లి శ్రీను, రత్నం యాదయ్య, రావుల మురళి, కల్మకులను యాదగిరి రెడ్డి, క్రీడాకారులు సింగం మధు, విగ్నేష్, గణేష్, రాకేష్, అఖిల్, జస్వంత్, యాదాద్రి, కార్తీక్, అజయ్, వాసు, వినయ్, ఎండి ఫైదాన్, మధు తదితరులు పాల్గొన్నారు.



# క్రికెట్ టోర్నీ

# విజేతలకు బహుమతుల ప్రధానం

### ముఖ్యఅతిథిగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి

కల్వకుర్తి ఊర్కొండ వార్త మిర్రర్ ప్రతినిధి:– ఊర్కొండ మండలం ముచ్చర్లపల్లిలో ప్రీమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బిజెపి రాష్ట్ర నాయకులు, నాగర్ కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు, ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, హాజరయ్యారు. ఇందులో భాగంగా మొదటి బహుమతి విజేతలకు రూ "15,016 రెండో బహుమతి రూ"7,516 టోర్నమెంట్ ప్రధాత బహుమతులు ఇవ్వడానికి వచ్చిన ముఖ్యఅతిథిగా ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, అదేవిధంగా మహబూబ్ నాగర్ జిల్లా కౌన్సిల్ మెంబర్ ముచ్చర్ల లక్ష్మారెడ్డి, మండల అధ్యక్షులు రాజేందర్ గౌడ్,మాజీ అధ్యక్షులు ఆంజనేయులు, పరశురాములు,పూర్ణదీప్, జయరాములు గౌడ్, నీలకంఠం రెడ్డి, రాఘవేందర్ గౌడ్,అనిల్ రెడ్డి,సురేష్,వెంకటేష్,లవకుశ, ఆర్గనైజర్స్ శ్రీనివాసులు, ఆనంద్ పాల్గొన్నారు.



# ఘనంగా జైపాల్ రెడ్డి 83వ జయంతి

### ::: రాష్ట్ర నాయకులు కాయితి ఆశాదిప్ రెడ్డి

కల్వకుర్తి జనవరి వార్త మిర్రర్ ప్రతినిధి:– తెలంగాణ యోధుడు ఉత్తమ పార్లమెంటేరియన్,కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ జైపాల్ రెడ్డి జయంతి సందర్భంగా కాయితి ఆశాదీప్ రెడ్డి ఆయనకు నివాళులు అర్పించారు. తెలంగాణ సహకారంతో జైపాల్ రెడ్డి పోషించిన పాత్ర ప్రజలెప్పుడు మర్చిపోలేరని గుర్తు చేసుకున్నారు. తెలంగాణ సాధన కోసం నిశ్శబ్ద సైనికుడిల దేశంలో అన్ని రాజకీయాల పార్టీలతో సమన్వయం చేసి కీలక పాత్ర పోషించిన మట్టి బిడ్డ అని కొనియాడారు.రాజకీయాలలో గొప్ప నేతగా విలువలకు ప్రతీకగా జయపాల్ రెడ్డి నిలిచారన్నారు. వారి ఆశయాలు,ఆకాంక్షలను ముందుకు తీసుకపోవడంలో ప్రతి ఒక్కరూ పాటుపడాలని కాయితీ ఆశాదిప్ రెడ్డి కోరారు.



## వృద్ధుల సంఘం ఆధ్వర్యంలో ఎస్సై జగన్ తాసిల్దార్ కృష్ణకు ఘనసన్మానం

సంస్థాన్ నారాయణపూర్ జనవరి 16:( వార్త మిర్రర్) నారాయణపురం మండల వృద్ధుల సంఘం అధ్యక్షుడు ముత్యాల చంద్రయ్య ఆధ్వర్యంలో స్థానిక ఎస్సై జగన్ మరియు తహసిల్దార్ మోహనకృష్ణ లకు గురువారం శాలువలో ఘన సన్మానం చేశారు. అనంతరం నూతన సంవత్సరం డైరీ ని అందజేశారు. ఈ కార్యక్రమంలో వృద్ధుల సంఘం కన్వీనర్ బద్దుల సోమయ్య యాదవ్, ఉపాధ్యక్షుడు గౌసోద్దీన్ ఖురేషి, జనరల్ సెక్రెటరీ సర్వేల్ యాకూబ్ అలీ, కోశాధికారి ఏపూరి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



## శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం కలిసిన జిల్లా నాయకులు..

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జనవరి 16 : తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో శాసనమండలి సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం కలసి జిల్లా సమస్యలపై వినతి పత్రం ఇవ్వడం జరిగింది. హైదరాబాద్ రాజధానికి దగ్గరగా ఉండి అభివృద్ధికి నోచుకోలేని గ్రామాలు లో సమస్యలతో కొట్టుమిట్టాడుతుందని ముఖ్యంగా చౌటుప్పల్ మండలంలో కాలుష్యంతో కనుమరుగయ్య పరిస్థితి ఏర్పడింది. అదేవిధంగా రామన్నపేట మండలం లో అంబుజా ఫ్యాక్టరీతో వల్ల ప్రజల ప్రాణాలకు నిప్పు వాటిల్లుతుందని అన్నారు. ఈ ఫ్యాక్టరీని రద్దు చేయాలని అదే విధంగా జిల్లాలో చేనేత రైతుల కార్మిక కర్షకుల సమస్యలపై యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దేశపాక శ్రీనివాస్ నేతృత్వంలో జిల్లా కమిటీ ప్రొఫెసర్ కోదండరామ్ కు అనేక విషయాలపై కులం కుశంగా చర్చించి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.ఈ విషయాలు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని పార్టీ ప్రజల కోసం ఎల్లవేళలా కృషి చేయాలని. దేశపాక శ్రీనివాస్ కు కోదండరాం సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నకరకంటి అశోక్,జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని శ్రీనివాస్ రెడ్డి,సహాయ కార్యదర్శి మందార బాలకృష్ణ రెడ్డి,జమ్మి గిరిబాబు,చౌటుప్పల్ మండలం నాయకులు సంగిశెట్టి జనార్ధన్,రామన్నపేట మండలం అధ్యక్షుడు గడ్డం యాదగిరి, తదితరులు పాల్గొన్నారు



## రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిని సన్మానించిన నియోజకవర్గ నాయకులు

శంకర్‌పల్లి , జనవరి:16: (వార్త మిర్రర్) : రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా శ్రీజ్యోతి భీమ్ భరత్ ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం చేవెళ్ల మండల కేంద్రంలో నియోజకవర్గంలోని ఐదు మండలాల నాయకులు శ్రీజ్యోతి భీమ్ భరత్ దంపతులను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో శంకర్పల్లి మాజీ ఎంపిటిసి ఎజాస్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు నసిరుద్దీన్ ఉన్నారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న ఆర్‌టివి ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ రవికి అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆర్థిక సహాయం

నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి (ఏలే భాస్కర్) : ఆర్ టి వి ఫోక్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ రవి తీవ్ర అనారోగ్యంతో గత రెండు నెలలుగా అపెండిక్స్ కడుపునొప్పితో బాధపడుతూ ఆపరేషన్ చేయించుకున్న ఐదు రోజుల్లో రవి తండ్రి అకాల మరణం, దానికి తోడు కడుపులో ఇన్ఫెక్షన్ తో నల్లగొండ పట్టణంలోని సంకల్ప ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలుసుకున్న అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు అక్కడికి చేరుకొని పండ్లు, నగదు ఆర్థిక సహాయం అందజేశారు. రవి కుటుంబ సభ్యులు అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు మాట్లాడుతూ రవి ఆరోగ్యంగా ఉన్న సమయంలో ఇలాంటి ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాల్లో పాల్గొని, స్వచ్ఛంద కార్యక్రమాలను తన వీడియో ద్వారా కవరేజ్ చేశారన్నారు. అలాగే తన యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎంతోమందికి తను నటించిన ఫోక్ సాంగ్స్ ని అందించారని గుర్తు చేశారు. రవితో పాటు పనిచేసిన ఎంతోమంది కళాకారులు, మీడియా మిత్రులు ఎంతో కొంత ఆర్థిక సహాయం చేసి హాస్పిటల్ బిల్లులకు సహకరించగలరని అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ వారు కోరుకున్నారు. అలాగే ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి మిత్రునికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రవికి ఇంకా ఆరోగ్యం మెరుగుపడనందు వల్ల ఆస్పత్రిలోనే చికిత్స పొందాలి కాబట్టి ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలనుకున్న వారు 8340988212 నెంబర్ కి ఫోన్ పే, గూగుల్ పే చేయగలరని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు సురకారపు యాదగిరి గౌడ్, కంచర్ల రఘురాం రెడ్డి, పాలకూరి నర్సింహా గౌడ్, దోనాల లింగారెడ్డి, కట్టెబోయిన సంజీవ యాదవ్, అయితరాజు ప్రసాద్, తుపాకుల ప్రవీణ్, తుమ్మలపల్లి మహేష్ మరియు చాకలి ఐలమ్మ సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ ఐతరాజు లక్ష్మణ్, రజక సంఘం నాయకులు యలిజాల శంకర్, నడిగోటి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాలలో జరిగే సన్నాహక సమావేశం విజయవంతం చేయండి

వార్త మిర్రర్ రాయికల్ (తిరుమల శంకర్) జనవరి 16 : జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణం లోని స్థానిక వీ.ఎస్.గార్డెన్ లో ఎం.ఎస్.పి జిల్లా అధ్యక్షులు దుమల గంగారాం స్థానిక మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు అణగారిన వర్గాల ఆశాజ్యోతి మందకృష్ణ మాదిగ సారథ్యంలో వేల గొంతులు, లక్ష డప్పు లతో హైదరాబాద్ మహానగరంలో ఫిబ్రవరి 7 న భారీ ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఇట్టి కార్యక్రమానికి వేలాది గా తరలివచ్చి విజయవంతం చేయడానికి ఈనెల 24న జగిత్యాల జిల్లా కేంద్రంలో సన్నాహక ప్రదర్శన సభ నిర్వహిస్తున్నామని ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంద కృష్ణమాదిగ రానున్నారని, ప్రతి గ్రామం నుండి డప్పు కళాకారులు, మాదిగ, మాదిగ ఉప కులాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉప అధ్యక్షులు బొనగిరి కిషన్, జిల్లా ప్రచార కార్యదర్శి కొల్లూరి సురేందర్, నియోజకవర్గ ఇంచార్జి పోడేటి సునీల్, మండల అధ్యక్షులు దోబ్బేల వేణు గోపాల్, మండల అధికార



ప్రతినిధి పాలెపు సురేష్, మాజీ ఉప సర్పంచ్ భాపురపు నర్సయ్, సీనియర్ నాయకులు తలారి రాజేష్, ఉద్యోగ సంఘం నాయకులు బొల్లె చిన్నయ్య, మాదిగ సంఘం లింగపల్లి రాజేష్, దులూరి శ్రీనివాస్, మారంపెల్లి గంగారాం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ ఎస్ కె ఫౌండేషన్ సహకారంతో తాజ్ పూర్ గ్రామంలో పరిశుభ్రతకు పెద్దపీట: జిల్లా సీఈవో శోభారాణి

### చెత్త రహిత గ్రామంగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.-డాక్టర్ ర్యాకల శ్రీనివాస్







యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి (గణేష్ సాగర్) : యాదాద్రి జిల్లా భువనగిరి మండలం, తాజ్ పూర్ గ్రామంలో బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్-సంతోష దంపతుల సొంత నిధులతో 700 తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి యాదాద్రి జిల్లా సీఈవో ఎన్ శోభారాణి, జిల్లా డిఆర్డిఓ టి. నాగిరెడ్డి, యాదాద్రి జిల్లా ఎంపీడీవో సిహెచ్ శ్రీనివాస్, చేతుల మీదుగా 700 తడి చెత్త, పొడి చెత్త బుట్టలను పంపిణీ చేశారు, అధికారులు మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరణ పై ప్రజలకు, మహిళలకు అవగాహన కల్పించాలన్నారు, వర్షాకాలం ప్రభావం వల్ల ఊరిలో అంతా పరిశుభ్రంగా ఉండాలని సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, తడి చెత్త పొడి చెత్త డబ్బాలు సక్రమంగా వాడుకోవాలని తెలిపారు, గ్రామం కోసం గ్రామ పరిశుభ్రత కోసం తన సొంత నిధులతో తడి చెత్త, పొడి చెత్త బుట్టలను అందజేసిన డాక్టర్ ర్యాకల శ్రీనివాస్-సంతోషలను అభినందించారు, ఈ సందర్భంగా డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ మాట్లాడుతూ తాజ్ పూర్ గ్రామాన్ని చెత్తరహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు, గ్రామ ప్రజలందరూ పరిశుభ్రతను పాటించాలని సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు, ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ ఉపసర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్, గ్రామ మహిళలు, గ్రామ పెద్దలు పలువురు పాల్గొన్నారు

# ఈఎంఏ పార్టనర్స్ ఇండియా ఐపీఓ 17న ప్రారంభం

ముంబై కేంద్రంగా పని చేస్తున్న ఈఎంఏ పార్టనర్స్ ఇండియా ఐపీఓ ఈ నెల 17న ప్రారంభం కానున్నది. సంస్థ రూ.76 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంగా ఐపీఓకు వెళుతోంది. ఐపీఐ ప్రైస్ బాండ్ విలువ రూ.117-124గా నిర్ణయించింది ఈఎంఏ పార్టనర్స్ ఇండియా. ఈ నెల 21న ఐపీఓ ముగియనున్నది. యాంకర్ ఇన్వెస్టర్ల కోసం ఈ నెల 16న బిడ్లను ఆహ్వా నిస్తున్నట్లు కంపెనీ శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. ఐపీఓ ద్వారా రూ.76.01 కోట్ల నిధులు సేకరించాలన్నది కంపెనీ లక్ష్యం. ఐపీఓ ద్వారా బిడ్ దాఖలు చేసే ప్రతి ఇన్వెస్టర్ కనీ సం వెయ్యి షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. తాజా షేర్ల జారీ ద్వారా 53.34 లక్షల షేర్లు జారీ చేసి రూ.66.14 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా మిగతా నిధులు కంపెనీ ప్రమోటర్లు కృష్ణన్ సుదర్శన్, సుబ్రమణ్యన్ కృష్ణ ప్రకాశ్‌లకు చెందిన 7.96 లక్షల షేర్లు విక్రయిస్తారు. ఈ మేరకు కంపెనీ ఈ నెల తొమ్మిదో తేదీన ఐపీఓకు వెళ్లేందుకు అను మతి కోరుతూ సెబీకి రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (ఆర్‌హెచ్పీ) ఫైల్ చేసింది. కంపెనీ ప్రమోటర్ శేఖర్ గణపతి కూడా తన వాటాను విక్రయిస్తారు. ఐపీఓలో క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్స్ (క్యూఐబీ)కు 50 శాతం. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు 15 శాతం, రిటైల్ ఇన్వెస్టర్లకు 35 శాతం షేర్లు కేటాయిస్తారు. 2003 సెప్టెంబర్‌లో కృష్ణన్ సుదర్శన్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా, సుబ్రమణ్యం కృష్ణ ప్రకాశ్‌లు ప్రమోటర్లుగా ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంట్ అసోసియేట్స్ ఇండియా ఏర్పాటైంది. దాన్ని తర్వాత ఈఎంఏ పార్టనర్స్ ఇండియాగా మార్చేశారు. ఐపీఓ రన్నింగ్ లీడ్ మేనేజర్‌గా ఇండోరియెంట్ ఫైనాన్సియల్ సర్వీసెస్ వ్యవహరించనున్నది. ఐపీఓ రిజిస్ట్రార్‌గా బిగ్‌షేర్ సర్వీసెస్ పని చేస్తుంది.







# కాగ్నిజెంట్ రిటైర్మెంట్ వయస్సు మరో రెండేండ్లు పెంపు

అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు నిర్వర్తిస్తున్న ఐటీ సంస్థ కాగ్నిజెంట్ అనుబంధ కాగ్నిజెంట్ ఇండియా కీలక నిర్ణయం తీసుకున్నది. భారత్‌లోని తమ సంస్థలో పని చేసే ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 58 నుంచి 60 ఏండ్లకు పెంచుతున్నట్లు ఉద్యోగులకు పంపిన ఇంటర్నల్ సమాచారంలో తెలిపింది. భారత్‌లోని తమ అనుబంధ సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుందని పేర్కొంది. సంస్థలో పని చేస్తున్న నిపుణులు, ప్రతిభావంతులను కాపాడుకోవడంతోపాటు మార్కెట్లో ఉన్న నైపుణ్యాన్ని ఆకర్షించడం కోసమే రిటైర్మెంట్ వయస్సు పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. పలు ఐటీ సంస్థలు తమ సంస్థల్లో రిటైర్మెంట్ వయస్సు 58 ఏండ్లుగా ఖరారు చేశాయి. వేతనంలో మార్పు లేకుండా రీలొకేట్ అయ్యే ఉద్యోగులకూ దే పాలసీ వర్తిస్తుంది. రిటైర్మెంట్ విధానం ప్రకారం అన్ ఇన్వెస్టెడ్ ఆర్ఎస్‌యూ, పీఎస్ యూ స్టాక్ అవార్డులను రిటైర్మెంట్ అయిన వెంటనే జప్తు చేశారు. ఈపీఎఫ్ఓ నుంచి ప్రత్యేక పర్మిషన్ తీసుకుంటే తప్ప ఉద్యోగుల పెన్షన్ ఫండ్ 58 ఏండ్లకు ముగుస్తుంది. కాగ్నిజెంట్ ప్రకటించిన నూతన రిటైర్మెంట్ విధానం గతేడాది నవంబర్ నుంచి అమల్లోకి వస్తుంది. కంపెనీ నుంచి అట్రిక్షన్లను నివారించడానికి కాగ్నిజెంట్ సీఈఓ రవి కుమార్ పలు చర్యలు అమలు చేశారు. ఆయన సీఈఓగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏప్రిల్‌లో వన్‌టైం అదనపు వేతనం పెంపు (కంపెనీ వార్షిక ఇంక్రిమెంట్ సైకిల్ తర్వాత ఒకసారి) అమలు చేశారు. 2022 అక్టోబర్ తర్వాత 2024 సెప్టెంబర్ త్రైమాసికంలో 13వేల మంది ఉద్యోగులు కాగ్నిజెంట్‌కు వెనక్కి వచ్చేశారని చెప్పారు. గత ఏడాది కాలంలో అట్రిక్షన్లు 16.2 నుంచి 14.6 శాతానికి తగ్గాయి.



# నయా పల్సర్ ఆగయా

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రముఖ ద్విచక్ర వాహన సంస్థ బజాజ్ ఆటో..దేశీయ మార్కెట్లోకి నయా పల్సర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పాత మాడల్‌తో పోలిస్తే నూతన ఫీచర్స్‌తో తీర్చిదిద్దిన ఈ బైకు ధర రూ.1.84 లక్షలుగా నిర్ణయించింది. పాత మాడల్‌తో పోలిస్తే ఈ కొత్త బైకు రూ.10 వేలు అధికం.

### హ్యుందాయ్ సరికొత్త మాడళ్లు

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్..దేశీయ మార్కెట్లోకి నయా మాడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటికే మార్కెట్లో అంత్యంత ప్రజాదరణ పొందిన వెన్యూ, వెర్నా, గ్రాండ్ ఐ10 నియోస్‌లను మరింత ఆధునీకరించి మార్కెట్లోకి విడుదల చేసింది. టెక్నాలజీ పరంగా భారీ మార్పులు చేసిన సంస్థ.. కంఫర్ట్, ఆధునిక ఫీచర్స్‌తో తయారు చేసినట్లు కంపెనీ సీవోవో తరుణ్ గార్గ్ తెలిపారు. 1.2 లీటర్ల పెట్రోల్ ఇంజిన్‌తో తయారైన వెన్యూ మాడల్‌లో స్మార్ట్ ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, 20.32 సెంటిమీటర్ల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, స్మార్ట్ కీతో పుష్ బటన్ స్టార్ట్/స్టాప్, పూర్తిగా ఆటోమేటిక్ కంట్రోల్ సిస్టమ్‌తో తయారు చేసింది. వెర్నా రూ.12.37 లక్షల నుంచి రూ.15.26 లక్షల వరకు, గ్రాండ్ ఐ10 నియోస్ రూ.7.09-8.29 లక్షల లోపు, వెన్యూ రూ.9.28 -10.79 లక్షల లోపు లభించనున్నాయి.

## ఫిబ్రవరి 5న శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి రానున్న హంపి పీఠాధిపతి




శంకర్‌పల్లి , జనవరి: 16: (వార్త మిర్రర్) : శంకర్‌పల్లి మండల చందిప్ప గ్రామ శివారులో గల 11 వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయానికి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు హంపి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య భారతి మహాస్వామి రానున్నారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని పీఠాధిపతి కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.




## పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారందరికీ అవకాశాలు

### రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు

శంకర్‌పల్లి ,జనవరి: 16: (వార్త మిర్రర్) : పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారందరికీ అవకాశాలు ఉంటాయని రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావు అన్నారు. గురువారం నగరంలోని గాంధీ భవన్ లో రంగారెడ్డి జిల్లాలో గల నియోజకవర్గాలకు, మున్సిపాలిటీలకు మహిళ కమిటీలకు అధ్యక్షురాలను నియమించారు. నూతనంగా ఏర్పాటైన మహిళ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించారు. చేవెళ్ల నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా మాడి రమ్యశ్రీ, జిల్లా సెక్రటరీగా ముత్యాల పుష్పమ్మ, శంకర్‌పల్లి మున్సిపల్ అధ్యక్షురాలిగా కడమంచి పుష్పమ్మ, మహేశ్వరం నియోజకవర్గానికి ఎర్రవాపు సమత, శేరిలింగపల్లి నియోజకవర్గానికి చంద్రిక ప్రసాద్ గౌడ్ ఎన్నికయ్యారు. ఎన్నికైన వారికి రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీమ్ భరత్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు నియామక పత్రాలు అందజేశారు. వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



# ఏఐజీ హాస్పిటల్స్ 800 కోట్ల పెట్టుబడి

### హైదరాబాద్‌లో ఆంకాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్న సంస్థ

హైదరాబాద్, జనవరి 11: ప్రముఖ ఆసుపత్రుల నిర్వహణ సంస్థ ఏఐజీ హాస్పిటల్స్ భారీ పెట్టుబడులకు సిద్ధమవుతున్నది. రూ.800 కోట్ల పెట్టుబడితో హైదరాబాద్‌లో ఆంకాలజీ సెంటర్‌ను నెలకొల్పబోతున్నట్లు ప్రకటించింది. ఇందుకోసం ప్రోటాన్ బీమ్ థెరపీ సిస్టాన్ని కొనుగోలు చేసింది. దేశవ్యాప్తంగా ఉన్న ఆంకాలజీ సెంటర్లలో ఇది మూడోది కావడం విశేషం. అలాగే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఇది తొలుతది. క్యాన్సర్ అడ్వాన్స్ థెరపీ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఏఐజీ..ఐబీఏ నుండి అధునాతన ప్రోటాన్ బీమ్ థెరపీలో క్యాన్సర్ చికిత్సను అందుబాటులోకి తీసుకురాబోతున్నది. ఇందుకోసం బెల్జియం కేంద్రంగా కార్యకలాపాలు అందిస్తున్న ఐబీఏతో జట్టుకట్టింది. ప్రోటాన్ బీమ్ థెరపీ అనేది రేడియోషన్ థెరపీలో అత్యంత ఖచ్చితమైన సమాచారం ఇవ్వనున్నది. ఇది అసాధారణమైన ఖచ్చితత్వంతో కణితులను లక్ష్యంగా చేసుకొని వైద్య సేవలు అందిస్తుంది. అలాగే చుట్టుపక్కలవున్న ఆరోగ్యకరమైన కణజాలాలకు హానిని గణనీయంగా తగ్గించడం ఈ థెరపీ ప్రత్యేకత. హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ కాంయపస్‌లోనే నెలకొల్పుతున్న ఈ సెంటర్ 300 పడకల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ ఆంకాలజీ సెంటర్ త్వరలో అందుబాటులోకి రాబోతున్నది.




# దూసుకుపోతున్న ఎల్ఐసీ

### 2024లో 15 శాతం వృద్ధిని సాధించిన సంస్థ

న్యూఢిల్లీ, జనవరి 11: ప్రభుత్వరంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ) దూసుకుపోతున్నది. ప్రైవేట్ బీమా సంస్థల నుంచి పోటీ తీవ్రతరమైనప్పటికీ అధిక వృద్ధిని సాధిస్తున్నది. 2024 సంవత్సరంలో నూతన బిజినెస్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 14.64 శాతం వృద్ధిని సాధించింది. లైఫ్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన నివేదిక ప్రకారం ఈ విషయాన్ని వెల్లడించింది. బీమా రంగ ఇండస్ట్రీ 14.41 శాతం వృద్ధిని సాధించగా, ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు 14.55 శాతం వృద్ధి కనబరిచాయి. గడిచిన 12 నెలల్లో ఎల్ఐసీ రూ.2,33, 073.36 కోట్ల ప్రీమియం వసూళ్లు జరపగా, క్రితం ఏడాదిలో రూ.2,03,303 కోట్లుగా ఉన్నాయి. మొత్తంమీద లైఫ్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీ రూ.4,02,773.18 కోట్ల మేర ప్రీమియం కలెక్షన్లు జరిపాయి. దీంట్లో ప్రైవేట్ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలు రూ.1,69,699.83 కోట్ల మేర ప్రీమియం వసూళ్లు చేశాయి. 2023లో వసూలు చేసిన రూ.1,48,323.21 కోట్లతో పోలిస్తే 14.41 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో ఇండివిజ్యూవల్ ప్రీమియం వసూళ్లలో ఎల్ఐసీ 4.92 శాతం వృద్ధిని సాధించింది. రూ.58, 486.69 కోట్ల నుంచి రూ.61,365.75 కోట్లకు పెరిగాయి. గడిచిన సంవత్సరంలో ఎల్ఐసీ 1.96 కోట్ల పాలసీలు, స్కీంలను జారీ చేసింది. అంతక్రితం ఏడాది విక్రయించిన 2.01 కోట్ల పాలసీలతో పోలిస్తే 2.72 శాతం తగ్గాయి.